
క్లుప్తంగా

గండి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల(యడ్లపాడు): నాదెండ్ల మండలం గణపవరం – చిలకలూరిపేట మార్గంలోని శివప్రియ నగర్ సమీపాన ఉన్న గండిపోచమ్మ దేవస్థాన వార్షిక వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించే వివిధ ఆధ్మాత్మిక కార్యక్రమాలను క్షేత్రం పీఠాధిపతి నిత్యవిద్యానంద భారతిస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. వార్షికోత్సవ రెండోరోజైన ఆదివారం పసుపుకొట్టే కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆదిపరాశక్తి అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం: మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నూతన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బొడ్డుపాటి విజయలక్ష్మి, వేల్పూరు జెడ్పీకి షేక్ మహబుబ్‌సుభాని, పోట్లూరు జెడ్పీకి సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, కారుమంచి జెడ్పీకి ఉమామహేశ్వరరావు, మతుకుమల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలకు కృష్ణతులసిలు బాధ్యతలు స్వీకరించారన్నారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వారు బాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

నరసరావుపేట టౌన్: క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం ఏరియా వైద్యశాల్లో చోటుచేసుకుంది. కారంపూడికి చెందిన మండవ నరసింహారావు(46) శనివారం పల్నాడు బస్టాండ్‌లో ఎలుకల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 సహాయంతో బాధితుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అనధికారికంగా ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

మాచవరం: మండలంలో పలు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ కొన్ని ప్రైవేట్ సంస్థలు ద్వారా అనధికారికంగా కొందరు వ్యక్తులు ఒక్కో కార్డుకు రూ.50 తీసుకుంటూ కార్డులు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని ఎవరూ తీసుకోవద్దని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రవర్తి తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేనందున ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొనవద్దని తెలిపారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన కార్డులు ఉచితంగా ఇవ్వడం జరుగుతందని, విషయాన్ని మండల ప్రజలు గ్రహించాలని తెలియజేశారు.

వేసవిలో దుక్కులు లోతుగా దున్నుకోవాలి

ముప్పాళ్ళ: వేసవిలో దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలని, వాలుగా అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు, పంటకోత దశల్లో నిద్రావస్థ దశలో ఉంటాయి. తెగుళ్ళను కలుగచేసే శిలీంద్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. లోతుగా దుక్కులు దున్నడం వల్ల భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, గుడ్లను, పక్షులు, కొంగలు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. లోతుగా దున్నడం వల్ల శిలీంధ్ర బీజాలు మట్టితో పాటు పైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. లోతు దుక్కులతో భూమి పై పొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా భూమిలో తేమ శాతం పెరిగి, భూసారం అభివృద్ధి, పురుగుల, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ వగైరా ప్రయోజనాలు సమకూరతాయి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్లయితే పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడు కోవచ్చన్నారు.

రాహు-కేతువులకు విశేష పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసిన శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో రాహు-కేతుపూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతులను విశేషంగా అలంకరించారు. రాహు-కేతులకు పూజించేందుకు ఆదివారం ప్రత్యేకమైనది కావడం, పల్నాడు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన రాహు-కేతుల ఆలయం కావడంతో పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దంపతులు, పిల్లల దోషనివారణకు పూజాదికాలు చేశారు. వారం వారం దోషనివారణ పూజలు చేసే భక్తులు తరలివచ్చారు.

జగనన్న పాలనలో అన్నివర్గాలకు మేలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చిలకలూరిపేట పదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని గుర్రాలచావిడి, వేలూరు రోడ్డు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. ముందుగా ఆరోవార్డు సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు మంత్రి విడదల రజినిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అందజేస్తోందని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి, వారికి ఆయా పథకాలను అందజేస్తోందని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తుందని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వెల్లడించారు. మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు బషీర్ మేస్త్రి, ఎస్‌కే హలీద్, ఎస్‌కే వలి, యూసుఫ్ సైదా, కరిముల్లా, మొయిన్, గుత్తా యాములయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన అతిథులు

నరసరావుపేట ఈస్ట్: పుస్తక పఠనం విద్యార్థులలో పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుందని వక్తలు పేర్కొన్నారు. శాఖ గ్రంథాలయంలో మే నెల 8వతేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వై.త్యాగరాజు, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపిచంద్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞాన, వినోద, ఇతర ఆసక్తిని కలిగించే పుస్తకాలు చదవటం ద్వారా ప్రతి విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని వివరించారు. గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కాగా, 35 రోజుల పాటు శిబిరంలో విద్యార్థులకు గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, కథలు, సృజనాత్మక అంశాలపై తరగతులు నిర్వహించారు. ఆయా అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు బి.వి.హెచ్.రఘురామ్, షేక్ అబ్దుల్‌రహీం, ఎం.కాంచన తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ తెలిపారు. చివరిరోజు జరిగిన కార్యక్రమంలో శ్రీరామా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు పాల్గొని మాట్లాడుతూ 35 రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులలో చిన్నారులకు చదవటం, కథలు, కథనాలు, సృజానాత్మక స్టోరీలు, ఆటలు పాటలు, చిత్రలేఖనం తదితర వాటిపై శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాససింగ్, సైదావలి, చిన్నారులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: వేసవిలో విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు మానసిక వికాసానికి, జ్ఞానసముపార్జనకు ఉపయోగపడ్డాయని బొల్లాపల్లి శాఖ గ్రంథాలయ అధికారి రమావతు సేవానాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో 35 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలకు వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరెడ్డి, యాకోబు, అచ్చిరెడ్డి, బషీర్ తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో గత నెల 8 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలో సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకలలో వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంతగుడిపాడు శాఖా గ్రంథాలయం ఇన్‌చార్జి అధికారి కె.వెంకట్రావు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, చెస్ వంటి పోటీలు నిర్వహించామన్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కలిగించామన్నారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గత నెల రోజుల నుంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిత్రలేఖనం, డిబేట్, వ్యాసరచన వంటి పోటీల్లో నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేసినట్లు గ్రంథాలయ అధికారి బద్రినాయక్ తెలిపారు. ప్రముఖ కవి కమలారామ్, వై.కేశవసూరి, వార్డు కౌన్సిలర్ దిల్షేద్‌లు పాల్గొని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.రమేష్, సీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ ఎ.రమణ ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్రలేఖనం, క్యారమ్స్, చెస్ వంటి పోటీల్లో గెలుపొందిన వారికి షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు.

మాలమహానాడు నూజెండ్ల అధ్యక్షుడిగా చంద్రబాబు



చంద్రబాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు పాలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మాలమహానాడు యువజన అధ్యక్షుడిగా మాలపాటి చంద్రబాబు నియామకం చేసినట్లు పల్నాడు జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు కొమ్మతోటి పాలు తెలిపారు. వినుకొండలోని కార్యాలయంలో ఈమేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆదేశాల మేరకు మండలాలకు కూడా అధ్యక్ష, కార్యదర్శులను నియమిస్తున్నట్లు పాలు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడు కొట్టే వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు, పెనుమాల శ్రీనివాసరావు, సామేలుతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఒత్తిడిలేని బోధన అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

యడ్లపాడు: మానసిక ఒత్తిడి లేని విద్యావికాసమే పిల్లల్లో శాశ్వతంగా గుర్తుండిపోతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. స్థానిక బైరాగిబావి సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యావనం పాఠశాలను గ్రామ పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల బట్టీ విధానం, మార్కులు, ర్యాంకుల వెంట పరుగులు, గ్రేడ్ల సాధన కోసం కసరత్తు చేయడం వలన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. విద్యార్థి జీవితాన్ని ఇవన్నీ ప్రభావితం చేయవని, సున్నిత అంశాలతో కూడిన సృజనాత్మక బోధన ఎంతో అవసరం అన్నారు. గురువులు ఈ దిశగా ఆలోచన చేసి బాలల భవితకు బంగారు బాటలు వేయాలని కోరారు. స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రకళ, పోపూడి గంగయ్యచౌదరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

శావల్యాపురం: నేడు మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతనంగా పోలేరమ్మతల్లి, కనకమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఉదయం 7.15 నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. నూతన దేవాలయానికి రూ. 10 లక్షల వ్యయంతో నిర్మాణ పనులను గ్రామస్తులు, దాతలు సహకారంతో చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పంట పొలాల రోడ్లకు మరమ్మతులు



టిప్పర్‌కు మట్టిని లోడ్ చేస్తున్న పొక్లెయిన్

కారెంపూడి: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో మండలంలోని మిరియాల గ్రామ రైతులు పొలం బాటలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా ఆదివారం కూడా రైతులు ఉత్సాహంగా పనులు చేయిస్తున్నారు. ఎంపీ పంపిన పొక్లెయినర్, జేసీబీ, టిప్పర్లతో రైతులు పొలం బాటలను రైతులు అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు పది పొలం బాటలకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు తొలగించి బాటలను వెడల్పు చేసి చదును చేశారు. వాటిలో నాలుగు రోడ్లకు గ్రావెల్ కూడా తోలి చదును చేస్తూ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. చర్లగుడిపాడు పొలిమేర నుంచి మిరియాల హైస్కూల్ వరకు ఐదు కిలో మీటర్ల బాటకు అలాగే చర్లగుడిపాడు మేజర్ కాల్వ నుంచి మిరియాల గ్రామం వరకు, చర్లగుడిపాడు కుంట దగ్గర నుంచి గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు, నరమాలపాడు డొంక నుంచి వైఎస్సార్ జగన్న కాలనీ లే అవుట్ వరకు ఉన్న పొలం బాటలకు గ్రావెల్ పరచి చదును చేయించే పనులు జరుగుతున్నాయి. ఇంత వరకు ఎప్పుడు కూడా పొలం బాటలను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని తొలిసారిగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి ఈ పనులు చేయిస్తున్నారని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పొలం బాటలు బాగా లేక పొలం వెళ్లడానికి నానా బాధలు పడేవారమని, పొలం దాకా ఎడ్ల బండ్లు కూడా పోలేని పరిస్థితి ఉండేదని ఇప్పుడు ఆ సమస్యలన్నీ ఇప్పుడు పరిష్కారం అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డిలకు రైతులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఈ రోజుల్లో రైతుల సమస్యలు గుర్తించే ఇలాంటి మంచి ఆలోచన గల ప్రజా ప్రతినిధులు ఉండడం చాలా గొప్ప విషయమన్నారు. ఇదిలా ఉంటే ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పంపిన యంత్రాలతో పాటు గ్రామంలో ఉన్న రైతులు కూడా తమ ట్రాక్టర్లతో ఉత్సాహంగా పనుల్లో పాలుపంచుకుంటున్నారు.

సాగర్‌మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



విజయపురిసౌత్: దేవుని కృప వల్ల లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియతల్లి పరమ పవిత్రురాలిగా కీర్తి పొందారని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. భక్తులు నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే ఆ తల్లి దీవెనలు అందిస్తుందన్నారు. అనంతరం సాగర్‌మాత దేవాలయం చుట్టూ భక్తులతో కలిసి ప్రదక్షిణలు చేసి దివ్యసత్ప్రసాద ఆశీర్వాదం అందజేశారు. దీనికి ముందు భక్తులు సాగర్‌మాత దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి, తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్ బీమా రెన్యువల్‌కు సహకరించండి

అమరావతి: మండల పరిధిలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రభుత్వం కల్పించే వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయడానికి లబ్ధిదారులు సహకరించాలని ఎంపీడీఓ మాధురి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 16 గ్రామ సచివాలయాల్లో ఇప్పటికి సుమారు 68 శాతం పూర్తయిందన్నారు. దిడుగు, ధరణికోట-1,2, అత్తలూరు, లింగాపురం, ఉంగుటూరు, మల్లాది, జూపూడి గ్రామ సచివాలయాల్లో 78 నుంచి 85 శాతం వరకు పూర్తయిందన్నారు. అలాగే నెమలికల్లు, నరుక్కుపాడు, కర్లపూడి, ఎండ్రాయి, అమరావతి-1, మునగోడు, వైకుంఠపురం, అమరావతి-2గ్రామ సచివాలయాల్లో 47 నుంచి 67 శాతం వరకు పూర్తయిందన్నారు. మండలం మొత్తం మీద 22208 మంది లబ్ధిదారులుండగా అందులో 2265 మంది అనర్హులు ఉన్నారని మిగిలిన 19943 మంది లబ్ధిదారులలో 13062 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారన్నారు. మిగిలిన 6881 మందికి వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయాల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు వలంటీర్లను సమన్వయ పరుచుకుని నూటికి నూరుశాతం వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయడానికి లబ్ధిదారులు సహకరించాలని ఆమె కోరారు.

ఏపీ మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

- ఆరో తరగతి ప్రవేశానికి 100 సీట్లకు 108 దరఖాస్తులు
- అర్హత పరీక్షలకు 77 మంది హాజరు



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నాదెండ్ల(యడ్లపాడు): ఏపీ ఆదర్శ పాఠశాలల 2023–24 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం అర్హత పరీక్షకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ మోడల్ స్కూళ్లలోనే ఆయా పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలలోనూ వందసీట్ల భర్తీ కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రవేశ పరీక్షను నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో ఈ రాత పరీక్షను పాఠశాల కార్యదర్శి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆరో తరగతి ప్రవేశాలకు వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 108 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 77 అర్హత పరీక్షకు హాజరైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తెలిపారు.

వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌లో...

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంతో పాటు నకరికల్లు, ఈపూరు తదితర మండలాల నుంచి మొత్తం 203 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 185 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. పరీక్షను పరిశీలించిన ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశ పరీక్ష 5వ తరగతిలో ఉన్న అన్ని సబ్జెక్టులలో సిలబస్‌కు సంబంధించి 100 మార్కులకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఓఎంఆర్ విధానంలో పరీక్ష జరిగిందన్నారు.

విద్యార్థుల ప్రశ్నాపత్రాలను హెడ్ ఆఫీసుకు పంపటం జరుగుతుందన్నారు. పరీక్షలలో వచ్చిన మార్కులను పరిశీలించి, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం తమ పాఠశాలలో సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు.

ఈ స్నేహబంధం.. ఇలానే కొనసాగిద్దాం



లింగారావుపాలెంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

- 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు
- లింగారావుపాలెం జెడ్పీలో 1993–94 బ్యాచ్ 'పది' పూర్వ విద్యార్థుల సమావేశం

యడ్లపాడు: పలు గ్రామాలకు చెందిన వారంతా 30 ఏళ్ల క్రితం యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఉద్యోగం, వ్యాపారం, వివాహం నిమిత్తం సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని తాము చదివిన పాఠశాల ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో 1993–94 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 50 మంది కలిసి సమావేశం అయ్యారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించారు. ఇకపై ఏటా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని తప్పక తమ స్నేహబంధాన్ని ఇలానే కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టిన పూర్వ విద్యార్థిని, అప్పటి ఉపాధ్యాయుడు మోహన్‌రావు మాస్టారు కుమార్తె అన్నపనేని లావణ్య, నంబూరి పావనిలను ఆబ్యాచ్‌లోని విద్యార్థులు అభినందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా సాగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు మూడు సేవా పురస్కారాలు



పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రజలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో ఉత్తమ సేవలు నిర్వహించిన వారికి ప్రభుత్వం ప్రత్యేక అవార్డులను కేటాయించింది. ప్రతి ఇంటికి వెళ్లి అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం అత్యంత ప్రతిభ కనబరిచన వలంటీర్లకు సేవా మిత్ర, సేవరత్న, సేవా వజ్రా వంటి అవార్డులతో ప్రోత్సాహక నగదును అందిస్తోంది. ఈక్రమంలోనే ఉత్తమ వలంటీర్‌గా పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి గ్రామా నికి చెందిన శ్రీ కన్య అత్యంత ప్రతిభను కనబరిచి వరుసగా సేవా మిత్ర, సేవరత్న, సేవా వజ్రా అవార్డులను సొంతం చేసుకుంది. గ్రామంలో సాధారణ రైతు కూలీ కుటుంబం నుంచి వలంటీర్‌గా ఎంపికై తమ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తూ రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజల వద్దకు తీసుకెళ్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా విధులు నిర్వర్తిస్తోంది శ్రీ కన్య, అందుకు గాను గ్రామ ప్రజలు సైతం శ్రీ కన్య సేవలను అభినందిస్తున్నారు.

నిదానంపాటి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అంబటి



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో వేంచేసి ఉన్న నిదానంపాటి అమ్మవారిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటుమాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి, గౌతుకట్ల గురవయ్య, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

సత్తెనపల్లి: విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ ఏ. రఘుపతిరావు అన్నారు. వావిలాల బ్యాట్మింటన్ ఇండోర్ స్టేడియంలో వేసవి క్యాంపు శిక్షణ ముగిసిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఐ రఘుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తమకు ఇష్టమైన క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన క్రీడా కారులకు సర్టిఫికెట్లు వావిలాల బ్యాట్మింటన్ ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు డాక్టర్ జి. శ్రీధర్, కార్యదర్శి సుబ్బయ్య, కోశాధికారి సూర్యనారాయణ, కోచ్ చంద్ర వాసు, ఎడ్యుకేట్ ది సొసైటీ అధ్యక్షుడు షేక్ అన్సారీ ఉన్నారు.